వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 51 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-






# కోటి తెల్ల కార్డులు!

## రికార్డు స్థాయికి చేరిన తెల్ల రేషన్ కార్డులు

- -కాంగ్రెస్ సర్కారు ఏర్పడేనాటికి 89,95,282
- -కొత్త కార్డుల పంపిణీతో 1,01,22,324కి చేరిన సంఖ్య
- -కొత్త రేషన్ లబ్ధిదారులకు దసరా కానుకగా సన్నబియ్యం

హైదరాబాద్,

తెల్ల రేషన్ కార్డుల సంఖ్య రాష్ట్రంలో రికార్డు స్థాయికి చేరుకుంది. గడిచిన నెల రోజుల్లో ఏకంగా 1.51 లక్షల కార్డులను పంపిణీ చేయటంతో.. తాజాగా 'కోటి' మైలురాయికి చేరింది. సెప్టెంబరు కోటా ప్రకారం రేషన్ కార్డుల సంఖ్య 99,70,832 కాగా.. ఇప్పుడు 1,01,22,324కు చేరాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిని ఒక రికార్డుగా భావిస్తోంది. కొత్తగా కార్డులు పొందిన కుటుంబాలన్నీ అక్టోబరు నుంచి లబ్ధిదారుల జాబితాలో చేరతాయి. దసరా కానుకగా వీరికి కూడా సన్న బియ్యం పంపిణీ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రేవంత్ సర్కారు ఏర్పడేనాటికి తెల్ల రేషన్ కార్డులపై ఉన్న లబ్ధిదారుల సంఖ్య 2.81 కోట్లు ఉండగా.. ప్రస్తుతం 3.25 కోట్లకు చేరటం గమనార్హం. నిజానికి, రేవంత్ సర్కారు అమలు చేసే ఆరు గ్యారెంటీల్లో రేషన్ కార్డుల పంపిణీ ఒకటి. రేవంత్ సర్కారు ఏర్పడేనాటికి 89,95,282 కార్డులున్నాయి. వీటిపై 2,81,47,565 మంది లబ్ధిదారులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డులు కావాలంటూ కొత్తగా 18 లక్షల దరఖాస్తులు వచ్చాయి. జనవరి 26 (గణతంత్ర దినోత్సవం) నుంచి లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మే చివరికి వచ్చేసరికి 2,03,156 కార్డులు మంజూరు చేసింది. ఈ ఏడాది జూలై 25వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించింది. పంద్రాగస్టు వరకూ 15 రోజులపాటు కొత్త కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించింది. అంతేనా.. కార్డుల మంజూరు ప్రక్రియను నిర్ణీత కాలానికే పరిమితం చేయకుండా.. నిరంతరాయంగా కొనసాగిస్తామని ప్రకటించింది. బియ్యంతోపాటు ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ తదితర పథకాలకు కూడా రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గడిచిన నెల రోజుల వ్యవధిలో కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ పెద్ద ఎత్తున చేపట్టారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు 15వ తేదీ (సోమవారం)నాటికి 1,51,492 కొత్త కార్డులను మంజూరు చేయటం విశేషం.



### 11.27 లక్షల కొత్త కార్డుల పంపిణీ

గత ప్రభుత్వ హయాంలోనూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త కార్డులు కావాలంటూ మొత్తం 18 లక్షల దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిలో రేవంత్ ప్రభుత్వం ఇప్పటి వరకు 11.27 లక్షల కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇంకా సుమారు 2.50 లక్షల కుటుంబాలకు కార్డులు మంజూరు చేసే అవకాశాలున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దరఖాస్తుల్లో తప్పులు దొర్లటం, కొన్ని ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయకపోవటం, సాంకేతిక సమస్యలు తలెత్తటంతో వీటిని పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని తెలిపారు. మండల, జిల్లాస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నామని, రాష్ట్రస్థాయిలో ప్రత్యేక ఐటీ సెల్ ఏర్పాటు చేసి.. కార్డుల మంజూరు, పంపిణీని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి అందిన 18 లక్షల దరఖాస్తుల్లో సుమారు 14 లక్షల కుటుంబాలు కొత్త రేషన్ కార్డులకు అర్హత సాధించినట్లు తెలిపారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 51 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

- చట్టబద్ధత లోపిస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తాం
- కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం హెచ్చరిక

న్యూఢిల్లీ,

అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా జరిగితే మొత్తం సర్ పక్రియను రద్దు చేస్తామని ఈసీని హెచ్చరించింది. సర్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సర్ పక్రియపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.రాజ్యాంగబద్ధ సంస్థ అయినా ఎన్నికల సంఘం బీహార్ సర్ పక్రియలో చట్టం, తప్పనిసరి నియమాలను పాటిస్తుందని తాము భావిస్తున్నామని ధర్మాసనం అభిప్రాయం వ్యక్తం చేసింది. బీహార్ సర్ పక్రియపై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని.. తుది తీర్పు దేశవ్యాప్త సర్ ప్రక్రియకు వర్తిస్తుందని పేర్కొంది. బిహార్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు ఎన్నికల కమిషన్

-మిగతా 3 లో



# వీధి దీపాలకు సోలార్ పవర్

పకడ్బందీగా వీధి దీపాల నిర్వహణ

- సోలార్ పవర్‌పై సాధ్యాసాధ్యాల పరిశీలన
- ఐఐటి సంస్థలతో ఆడిటింగ్ జరిపేలా చర్యలు
- పెద్ద కంపెనీల నుంచి టెండర్ల ఆహ్వానం
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ

వీధి దీపాల నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుంచి వెంటనే టెండర్స్ పిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో సీఎం రేవత్‌రెడ్డి సమిక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సమావేశంలో అధికారులకు పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. వీధి దీపాలకు సోలార్ పవర్‌ను వినియోగించడంపైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని మార్గనిర్దేశర చేశారు.

-మిగతా 3 లో





## కవితతో విష్ణువర్దన్ రెడ్డి భేటీ

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంతనాలు

హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ

మాజీ ఎమ్మెల్యే, దివంగత పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్ ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో వీళ్లిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పీజేఆర్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన విష్ణువర్ధన్ రెడ్డి ఖైరతాబాద్ నుంచి 2008లో నిర్వహించిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తర్వాత 2009లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం

-మిగతా 3 లో



## ఖతార్ విషయంలో జాగ్రత్త..

- అది మాకు మిత్రదేశం..
- నెతన్యాహుకు ట్రంప్ వార్నింగ్

న్యూఢిల్లీ,

ఖతార్ రాజధాని దోహా లో హమాస్ నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానిక దళం గత వారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖతార్ తమకు చాలా ముఖ్యమైన మిత్ర దేశమని చెప్పారు. ఖతార్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలని ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. 'నెతన్యాహు.. ఖతార్ విషయంలో జాగ్రత్త. అది అమెరికాకు చాలా ముఖ్యమైన మిత్రదేశం. హమాస్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నప్పటికీ ఖతార్ జోలికి మాత్రం వెళ్లొద్దు. ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు ఆచితూచి వ్యవహరించాలి' అని హెచ్చరించారు.గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా చేసిన ప్రతిపాదనలపై చర్చించేందుకు గత వారం దోహాలో హమాస్ కీలక నేతలు సమావేశమయ్యారు. ఆసమయంలో

-మిగతా 3 లో


## అమెరికాలో మళ్లీ టిక్‌టాక్..

- చైనాతో డీల్ కుదిరిందన్న ట్రంప్

న్యూయార్క్

టిక్‌టాక్ యాప్ మళ్లీ అమెరికాలో వాడనున్నారు. ఆ సోషల్ మీడియా యాప్ వాడకం గురించి చైనాతో డీల్ జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇవాళ వెల్లడించారు. టిక్‌టాక్ యాప్‌ను ఆపరేషనల్‌గా ఉంచేందుకు చైనా కంపెనీతో దాదాపు ఓ ఒప్పందం కుదిరినట్లు ఆయన చెప్పారు. టిక్‌టాక్ వ్యవహారం గురించి చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో శుక్రవారం చర్చలు జరపనున్నట్లు ట్రంప్ తెలిపారు. దేశంలోని యువత ఆ యాప్ కోసం ఆసక్తిగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అమెరికా, ఈయూ, చైనా మధ్య జరిగిన వాణిజ్య భేటీపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.చైనాకు చెందిన టెక్నాలజీ కంపెనీ

-మిగతా 3 లో





# మరో మూడ్రోజులు భారీ వర్షాలు

- వాతావరణశాఖ హెచ్చరిక

హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలో మరో మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి,

-మిగతా 3 లో

## అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడేషన్ కార్డులపై విధివిధాలు రూపొందించాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐపిఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక,

-మిగతా 3 లో

## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన


సీఎం రేవంత్‌తో భట్టి, శ్రీదర్ బాబుల సమీక్ష



హైదరాబాద్,

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై కాలేజీ యాజమాన్యాల తీరుపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. కాలేజీల బంద్‌తో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబులు సిఎం రేవంత్‌తో చర్చించారు. ఈ క్రమంలో తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన

-మిగతా 3 లో



## అమెరికాకు మాస్కో కౌంటర్

భారత్-రష్యా మధ్య సంబంధాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవడం ఖాయం..

న్యూఢిల్లీ,

రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే భారత్‌పై అధిక సుంకాలు బాదిన ట్రంప్ ఈయూ, జీ-7 దేశాలపై కూడా ఒత్తిడి చేస్తున్నారు. భారత్ దిగుమతులపై అమెరికా తరహాలోనే అధిక సుంకాలు విధించాలని ఆయా దేశాలకు సూచిస్తున్నారు. ఇందుకు జీ-7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్టు సమాచారం. ఈ పరిణామాలపై మాస్కో తీవ్రంగా స్పందించింది. అగ్రరాజ్యం అమెరికాకు కౌంటర్ ఇచ్చింది.అమెరికా తరహాలోనే ఇతర దేశాలు కూడా భారత్‌పై టారిఫ్‌లు విధించాలని ట్రంప్ ఒత్తిడి తెస్తున్నప్పటికీ ఢిల్లీతో తమ సంబంధం స్థిరంగా కొనసాగుతుందని వ్యాఖ్యానించింది. 'ఢిల్లీ-మాస్కో మధ్య సంబంధాలు స్థిరంగా, నమ్మకంగా ముందుకు సాగుతున్నాయి. దానిని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవడం ఖాయం. అమెరికా, నాటో దేశాల ఒత్తిడిని ఎదుర్కొంటూ రష్యా చమురు కొనుగోలు కొనసాగిస్తున్నందుకు భారత్‌ను అభినందించాల్సిందే. బాహ్య బెదిరింపులు, విమర్శలు ఉన్నా, ఇండియా తన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది' అని రష్యా విదేశాంగ శాఖ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొంది.ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తున్నది. ఇందులో భాగంగానే రష్యా మిత్ర దేశమైన భారత్‌పై భారీగా సుంకాలు విధించటం ద్వారా ఒకరకంగా

-మిగతా 3 లో

# బండి సంజయ్‌పై కేటీఆర్ 10 కోట్ల పరువు నష్టం దావా

సిటి సివిల్ కోర్టులో పిటిషన్ వేసిన కేటీఆర్

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలు చేయడంతో పిటిషన్
- ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





హైదరాబాద్,- ప్రజా స్వేచ్ఛ

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. బండి సంజయ్‌తో పాటు పలు మీడియా సంస్థలు, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లపై హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో పిటిషన్ వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిరాధార ఆరోపణలు చేయడంతో పాటు తప్పుడు కథనాలను ప్రచురించినందుకు కేటీఆర్ ఈ దావా వేశారు. తప్పుడు సమచారాన్ని తొలగించడంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారంగా రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.2025 ఆగస్టు 8న బండి సంజయ్ తప్పుడు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ తన పిటిషన్‌లో

-మిగతా 3 లో

## ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా?



ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల


హుజూరాబాద్,- ప్రజా స్వేచ్ఛ

తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తోందని అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణలో

-మిగతా 3 లో

# కేరళలో 67కు చేరిన మెదడు తినే అమీబా కేసులు..

## 18 మరణాలు నమోదు




**తిరువనంతపురం- ప్రజా స్వేచ్ఛ**
: కేరళలో మెదడు తినే అమీబా కేసుల సంఖ్య 67కు చేరింది. తాజాగా 17 ఏళ్ల బాలుడికి అమీబిక్ మెనింగోఎన్‌సెఫాలిటిస్ అనే అరుదైన ఇన్ఫెక్షన్ సోకింది. స్నేహితులతో కలిసి అక్కులం టూరిస్ట్ విలేజ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టిన తర్వాత ఆ యువకుడు ఈ వ్యాధి బారినపడినట్లు ఆరోగ్యశాఖ అధికారులు నిర్ధారించారు. దీంతో ఆ స్విమ్మింగ్ పూల్‌ను అధికారులు మూసివేశారు. నీటి నమూనాలు సేకరించి పరీక్ష కోసం పంపారు.కాగా, మెదడు తినే అమీబా వ్యాధి కారణంగా కేరళలో గత వారం ఒకే నెలలో ఐదో మరణం సంభవించింది. మలప్పురం జిల్లాలోని వండూర్‌కు చెందిన 56 ఏళ్ల శోభనకు ఈ వ్యాధి సోకింది. కోజికోడ్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆమె మరణించింది. అదే హాస్పిటల్‌లో చికిత్స పొందిన సుల్తాన్ బతేరీకి చెందిన 45 ఏళ్ల రతీష్ అనే మరో రోగి కూడా అదే వ్యాధితో చనిపోయాడు. దీంతో మెదడు తినే అమీబా వల్ల ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 18 మంది మరణించారు. మరోవైపు అమీబిక్ మెనింగోఎన్‌సెఫాలిటిస్ వ్యాధి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ అధికారులను ఆదేశించారు. నీటి వనరులు, పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. 'నీటి నిల్వలను శుభ్రంగా ఉంచాలి. అమీబా ముక్కు ద్వారా మెదడులోకి ప్రవేశిస్తుంది. కాబట్టి ముక్కులోకి నీరు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోండి' అని సూచించారు.

# ఏఐ కంటెంట్‌కు లైసెన్స్, లేబులింగ్

## పార్లమెంటరీ కమిటీ సిఫారసు

**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**




కృత్రిమ మేధ (ఏఐ) కంటెంట్ క్రియేటర్ల కోసం కొత్త నిబంధనలను పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల ప్రకారం, ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఆర్టికల్స్ కోసం లైసెన్స్ తీసుకోవలసి ఉంటుంది, తప్పనిసరిగా లేబులింగ్ చేయవలసి ఉంటుంది. దీనికి సంబంధించిన ముసాయిదా నివేదికను బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే నేతృత్వంలోని కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై స్థాయీ సంఘం రూపొందించింది. ఈ నివేదికను లోక్ సభ సభాపతి ఓం బిర్లాకు సమర్పించింది. సమాచార, ప్రసారబీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ వంటి వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించింది. ఫేక్ న్యూస్‌ను సృష్టించి, వ్యాపింపజేసే వారిని గుర్తించి, శిక్షించడానికి పటిష్టమైన న్యాయ, టెక్నలాజికల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి ఇది దోహదపడుతుందని పేర్కొంది. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి సులువుగా కంటెంట్‌ను క్రియేట్ చేయవచ్చు. దీనివల్ల ఏది వాస్తవం, ఏది నకిలీ అనేది తెలుసుకోవడం కష్టమవుతున్నది. ఏఐ జనరేటెడ్ ఫేక్ న్యూస్ ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తుందని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఈ కమిటీ పేర్కొంది.

# నేడు భారత్-అమెరికా వాణిజ్య చర్చలు

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**



భారతీయ వస్తువులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకం విధించిన అనంతరం ప్రతిష్టంభనకు గురైన భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరిపేందుకు అమెరికా ప్రభుత్వ ప్రధాన సంధానకర్త బ్రెండన్ లించ్ సోమవారం అర్ధరాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం(బీటీఏ)పై ఇప్పటివరకు ఐదు విడతల చర్చలు జరగగా ఆగస్టు 25-29 మధ్య జరగవలసిన ఆరవ విడత చర్చలు భారతీయ వస్తువులపై అమెరికా ప్రభుత్వం 50 శాతం సుంకాలు విధించడంతో వాయిదాపడ్డాయి.

# విద్యార్థులకు 75% హాజరు తప్పనిసరి

## 10, పన్నెండో తరగతులకు సీబీఎస్ఈ కొత్త నిబంధనలు



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
పదో తరగతి, పన్నెండో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అర్హత నిబంధనలను సీబీఎస్ఈ కఠినతరం చేసింది. పరీక్షలు రాయడానికి అర్హత పొందాలంటే విద్యార్థులు కనీసం 75 శాతం తరగతులకు హాజరై ఉండాలని తెలిపింది. విద్యాపరమైన, హాజరుకు సంబంధించిన నిబంధనలను నెరవేర్చని విద్యార్థులను పరీక్షలకు అనుమతించేది లేదని స్పష్టం చేసింది. పదో తరగతి, పన్నెండో తరగతి రెండేళ్ల ప్రోగ్రామ్స్ అని పేర్కొంది.విద్యార్థి పాఠశాలకు హాజరుకాకపోతే, అతని ఇంటర్నల్ అసెస్‌మెంట్ జరగదని తెలిపింది. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లో పనితీరు కనబరచకపోతే, ఆ విద్యార్థి పరీక్షల ఫలితాన్ని ప్రకటించేది లేదని పేర్కొంది. అలాంటి విద్యార్థులను ఎసెన్షియల్ రిపీట్ క్యాటగిరీలో పెట్టనున్నట్లు వివరించింది. అనుమతి లేకుండా సబ్జెక్టులను ఆఫర్ చేయవద్దని అనుబంధ పాఠశాలలను సీబీఎస్ఈ హెచ్చరించింది.

# 1974 తర్వాతి నిరసనలపై అధ్యయనం

## అధికారులకు అమిత్ షా ఆదేశం



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
పొరుగు దేశాల్లో తలెత్తుతున్న ఆందోళనలు, నిరసనలు మన దేశంలోని పాలకులను ఆలోచనలో పడేస్తున్నాయి. మనదేశంలో.. ము ఖ్యంగా 1974 తర్వాత తలెత్తిన నిరసనలన్నింటిపైనా అధ్యయనం చేయాలని కేంద్ర హెూంశాఖ అధికారులను అమిత్ షా ఆదేశించారట.నిరసనల వెనుకున్న కారణాల్ని విశ్లేషించాలని, ముఖ్యంగా ఆర్థిక కోణాలు, తెరవెనుక వ్యక్తులు, తుది ఫలితాలు.. మొదలైనవి తెలుపుతూ 'బ్యూరో ఆఫ్ పోలీస్ రిసెర్చ్, డెవలప్‌మెంట్' అధికారుల నుంచి అమిత్ షా నివేదిక కోరారు. దేశవ్యాప్తంగా సామూహిక ప్రజా ఆం దోళనలు, నిరసనలు తలెత్తితే.. వాటి ని ఎలా ఎదుర్కోవాలి? అన్నదానిపై కసరత్తు చేయాలని వారికి తెలిపారట.

# మా మక్కజొన్న కొనాల్సిందే..

## భారత్‌కు ట్రంప్ సర్కార్ బెదిరింపు

**వాషింగ్టన్, - ప్రజా స్వేచ్ఛ**
భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరగనున్న వేళ ట్రంప్ సర్కార్ నుంచి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ముందస్తు బెదిరింపులు మొదలయ్యాయి. అమెరికాలో పండించిన మక్క పంటను భారత్ కొనుగోలు చేయడానికి నిరాకరిస్తే అమెరికన్ మార్కెట్‌కు భారత్ దూరం కావలసి వస్తుందని అమెరికా వాణిజ్య మంత్రి హెూవర్డ్ లుట్నిక్ హెచ్చరించారు. ఒకపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై తన ఆంక్షలను సడలించుకునే ప్రయత్నం చేస్తుండగా లుట్నిక్ మాత్రం భారత్ తన సుంకాలను తగ్గించుకోకపోతే కష్టకాలం ఎదుర్కోవలసి వస్తుందని బెదిరించడం గమనార్హం. ఆక్సియోస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో లుట్నిక్




మాట్లాడుతూ భారత్-అమెరికా సంబంధాలు ఏకపక్షంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమెరికాకు విక్రయించి భారత్ సొమ్ము చేసుకుంటోంది. మా మార్కెట్‌లోకి వచ్చి ప్రయోజనం పొందాలని మేము ఆహ్వానిస్తుంటే భారత్ మాత్రం మమ్మల్ని తన మార్కెట్‌లోకి మేము రాకుండా అడ్డుకుంటోంది అని ఆయన ఆరోపించారు.మకు 140 కోట్ల జనాభా ఉందని భారత్ గొప్పలు చెప్పుకుంటుందని, 140 కోట్ల మంది కలసి ఒక బుషెల్ మక్కలు (అంటే 25.4 కిలోలతో సమానం) కూడా కొనలేరా అని ఆయన ప్రశ్నించారు. వాళ్లు(భారత్) మాత్రం తమకు అన్నీ అమ్ముతారని, తమ దగ్గర నుంచి మాత్రం మక్కజొన్న కూడా కొనరని, అన్ని వస్తువులపై సుంకాలు మాత్రం విధిస్తారని, ఇది తమకు బాధ కలిగించదా అని ఆయన ఆక్రోశం వెళ్లగక్కారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలు తగ్గించి, తాము ఎలా వ్యవహరిస్తామో తమ పట్ల కూడా భారత్ అలాగే వ్యవహరించాలని ట్రంప్ కోరుతున్నారని లుట్నిక్ చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు ట్రంప్ ప్రభుత్వం పోరాడుతోందని, తాము దీన్ని సరిచేసేంత వరకు సుంకాలు దారిలోకి రావని ఆయన వ్యాఖ్యానించారు. ఇది అధ్యక్షుడు ట్రంప్ మోడల్. మీరు ఒప్పుకునైనా తీరాలి లేదా ప్రపంచంలోని అతి పెద్ద వినియోగదారుడితో వ్యాపారం చేసే అవకాశాన్నయినా కోల్పోవాలి అంటూ ఆయన హెచ్చరించారు.

# వక్ఫ్ చట్టానికి పాక్షికంగా బ్రేక్..

వివాదాస్పద నిబంధనలపై స్టే విధించిన సుప్రీంకోర్టు
ఐదేళ్లపాటు ఇస్లాం పాటించాలన్న నిబంధన నిలిపివేత
వక్ఫ్ ఆస్తిలో కలెక్టర్ల జోక్యం నిలుపుదల

**న్యూఢిల్లీ, - ప్రజా స్వేచ్ఛ**
కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం, 2025 చట్టబద్ధతను సవాలు చేసిన పిటిషనర్లకు సుప్రీంకోర్టులో పాక్షిక ఉపశమనం లభించింది. వక్ఫ్ చట్టంలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులో ఎవరు సభ్యులుగా ఉండాలన్న అంశంపై సిఫార్సు చేయడంతోపాటు వక్ఫ్‌ను ఎవరు సృష్టించవచ్చు, ఆక్రమణలకు చెందిన వివాదాలను ఎవరు పరిష్కరించాలన్న అంశాలకు సంబంధించిన నిబంధనలను సుప్రీంకోర్టు నిలిపివేసింది. వక్ఫ్ చట్టంపై మొత్తంగా స్టే విధించాల్సిన అవసరం ప్రస్తుతం న్యాయస్థానానికి కనిపించడం లేదని, కొత్త చట్టంలో రాజ్యాంగపరమైన సవాళ్లకు సంబంధించి




విస్తృత స్థాయిలో విచారణ జరుపుతామని సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది.మొత్తం చట్టాన్నే పిటిషనర్లు సవాలు చేశారని, అయితే మౌలికంగా చట్టంలోని 3(ఆర్), 3సీ, 14 సెక్షన్లను పిటిషనర్లు సవాలు చేశారని ధర్మాసనం తెలిపింది. సవాలు చేసిన సెక్షన్లపై తాము స్టే ఇస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని తప్పనిసరిగా పాటించాలన్న నిబంధనను(సెక్షన్ 3(ఆర్) నిలిపివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇస్లాంను ఆచరిస్తున్న వ్యక్తిని నిర్ధారించడానికి నిబంధనలు రూపొందించే వరకు ఈ సెక్షన్‌పై స్టే విధిస్తున్నట్లు కోర్టు పేర్కొంది. వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునా కాదా అన్న విషయాన్ని నిర్ధారించి ఉత్తర్వులు జారీ చేసే అధికారాన్ని కలెక్టర్‌కు అప్పగిస్తూ చట్టంలో పొందుపరిచిన నిబంధనపై(సెక్షన్ 3సీ(4)) కూడా ధర్మాసనం స్టే విధించింది.

వక్ఫ్ ఆస్తిగా ప్రకటించిన ఆస్తి ఆక్రమణ ద్వారా జరిగిందీ లేనిదీ నిర్ధారిస్తూ ప్రభుత్వం నియమించిన అధికారి నివేదికను సమర్పించే వరకు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనపై(సెక్షన్ 3సీ(2) కూడా కోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న నిబంధనపై(సెక్షన్ 9,14) స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో ముగ్గురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని, వక్ఫ్ కౌన్సిళ్లలో నలుగురికి మించి ముస్లిమేతర సభ్యులను నియమించరాదని ధర్మాసనం స్పష్టం చేసింది..

# నేపాల్ క్యాబినెట్‌లోకి మరో ముగ్గురు మంత్రులు



**ఖాట్మండు- ప్రజా స్వేచ్ఛ**
నేపాల్ ప్రధాని సుశీలా కర్కి నేతృత్వంలోని తాత్కాలిక మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురు మంత్రులను చేర్చుకున్నారు. అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడల్ సోమవారం వీరితో ప్రమాణస్వీకారం చేయించారు. ఆర్థిక మంత్రిగా రమేషోర్ ఖానల్, ఇంధన శాఖ మంత్రిగా కుల్మాన్ ఘీజింగ్, హెూం మంత్రిగా ఓం ప్రకాష్ ఆర్యల్‌లతో ఆదివారం సుశీలా కర్కి క్యాబినెట్ ఏర్పాటు చేశారు. ఖానల్ ఇప్పటివరకు ఆర్థిక శాఖ కార్యదర్శిగా చేశారు. ఇప్పుడు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక సంస్కరణలపై గత ప్రభుత్వానికి ఆయన 400 పేజీలతో కొన్ని సిఫార్సులను కూడా అందచేశారు. ఒకప్పుడు నేపాల్‌లో విపరీతంగా వున్న విద్యుత్ కోతలకు అంతం పలికిన ఘనత కుల్మాన్ ఘీజింగ్‌దే. ప2016 వరకు నేపాల్ రోజుకు 18గంటల పాటు విద్యుత్ కోత ఎదుర్కొనేది. ఘీజింగ్ వచ్చిన తర్వాత మొదటిసారిగా 24గంటలు విద్యుత్ అందుబా టులోకి వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయవాది అయిన ఆర్యల్ అవినీతిపై పోరాడే యోధుడుగా అందరికీ చిరపరిచితుడు. ప్రధాని కర్కికి అత్యంత విశ్వసనీయుడైన ఆర్యల్ పార్లమెంట్ రద్దుపై నెలకొన్న ప్రతిష్టం భనను పరిష్కరించేందుకు జరిగిన చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

# ఇజ్రాయిల్ దాడులకు 25 మంది పాలస్తీనియన్లు మృతి

**గాజా - ప్రజా స్వేచ్ఛ**
సోమవారం ఉదయం ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడిలో ఆరేళ్ల కవలపిల్లలతో సహా 25 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. ఇక నిన్న నివాస భవనాలపై జరిపిన బాంబు దాడిలో కనీసం 16 బహుళ అంతస్తుల భవనాలు విధ్వంసమయ్యాయి. ఈ దాడి వల్ల 53 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు. కాగా, అక్టోబర్ 7 2023 నుండి ప్రారంభమైన



దాడుల వల్ల 64,871 మంది మృతి చెందారు. 164,610 మంది గాయాలపాలయ్యారు. ఇదిలా ఉండగా.. ఐక్యరాజ్యసమితితో సహా పలు దేశాలు ఇజ్రాయిల్.. పాలస్తీనాపై దాడుల్ని ఆపాలని పిలుపునిచ్చాయి. అయినప్పటికీ ఇజ్రాయిల్ దాడుల్ని కొనసాగిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్‌తో సంబంధాలు తెంచుకోవాలని ముస్లిం దేశాలను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కోరారు.

# వీధి దీపాలకు సోలార్ పవర్

(మొదటి తరువాయి)

రాష్ట్రంలోని అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఏఐతో ఎప్పటికప్పుడు విశ్లేషణ చేయాలని సూచించారు. గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణను గ్రామ పంచాయతీకి అప్పగించాలని మార్గనిర్దేశర చేశారు . రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణలో సమూల మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేమ నరేందర్‌రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు- అనేక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో వీధిదీపాల ఏర్పాటు-, నిర్వహణ కోసం పెద్ద కంపెనీల నుండి -టె-ండర్లను పిలవాలని సూచించారు. దీనివల్ల పారదర్శకత పెరిగి, సేవల నాణ్యత మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, వీధిదీపాల కోసం సౌరశక్తి వినియోగం సాధ్యాసాధ్యాలను లోతుగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వీధిదీపాల పనితీరును నిర్ధారించడానికి ఐఐటీ- వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సీఎం ఆదేశించారు. అంతేకాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వీధిదీపాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి, కేంద్రంగా పర్యవేక్షించే విధానాన్ని రూపొందించాలని సూచించారు. దీని ద్వారా ప్రతి దీపం స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వీధిదీపాల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా ఎప్పటికప్పుడు విశ్లేషణ జరిపి, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారాలు తీసుకోవాలని సూచించారు. సీఎం రేవంత్ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో వీధిదీపాల నిర్వహణను పూర్తిగా గ్రామపంచాయతీలకే అప్పగించాలని నిర్ణయించారు. సర్పంచ్‌లకు దీపాల ఏర్పాటు-, నిర్వహణపై పూర్తి అధికారం ఇవ్వబడుతుంది. అయితే, ఈ పనులపై ఎంపీడీవో స్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి వీధిదీపం, ప్రతి పోల్‌పై సర్వే చేయాలని సీఎం ఆదేశించారు. దీని ద్వారా సమస్యలు, లోపాలు, అదనపు అవసరాలను గుర్తించి త్వరితగతిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటు-ందని అన్నారు. వీధిదీపాల వ్యవస్థను ఆధునీకరించడానికి తీసుకుంటున్న ఈ చర్యలు రాబోయే రోజుల్లో రాష్ట్రానికి ఒక మోడల్‌గా నిలుస్తాయని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. పారదర్శక విధానాలు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, గ్రామీణ స్థాయి అధికారానికి బాధ్యత కల్పించడం ద్వారా వీధిదీపాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలమన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

# బండి సంజయ్‌పై కేటీఆర్ 10 కోట్ల పరువు నష్టం దావా

(మొదటి తరువాయి)



పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలలో తెలంగాణ ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఫోన్ ట్యాపింగ్. ఆర్థిక అవకతవకలకు ముడిపెట్టారని తెలిపారు. ఏబీఎన్ తెలుగు, ఎన్టీవీ, టీవీ5, వీ6, ఏఎన్ఎన్ తెలుగు వంటి టీవీ ఛానెళ్లు, అలాగే ఇండియా టుడే, ఎన్డీటీవీ, డెక్కన్ హెరాల్డ్, టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, అలాగే ఎక్స్ (ట్విట్టర్), యూట్యూబ్, గూగుల్, మెటా (ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్) వంటి సోషల్ మీడియా సంస్థలు ఈ వ్యాఖ్యలను విస్తృతంగా ప్రసారం చేశాయన్నారు. ఈ వ్యాఖ్యలు కేవలం పరువుకు భంగం కలిగించడమే కాకుండా, తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా ఉన్నాయని తెలిపారు. ఈ ఆరోపణలపై 2025 ఆగస్టు 11న లీగల్ నోటీసు పంపినప్పటికీ, బండి సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పడానికి నిరాకరించారని.. అందుకే న్యాయస్థానాన్ని ఆశ్రయించానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. బండి సంజయ్ కేవలం రాజకీయ కక్షతో "విపరీతమైన నిందారోపణలతో దుష్ప్రచారానికి" పాల్పడ్డారని తెలిపారు. అధికారంలో ఉన్న కేంద్ర మంత్రి ఇటువంటి బాధ్యతారహితమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజా ప్రతినిధుల విశ్వసనీయత, గౌరవానికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని కూడా ఈ ఫిర్యాదులో నొక్కి చెప్పారు. నిరాధార ఆరోపణలపై బండి సంజయ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పిటిషన్‌లో కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోసారి తన పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకుండా, ప్రసారం చేయకుండా నిందితులను నిరోధించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా పోర్టల్స్‌లో ప్రచురించిన కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## ఫీజు రియంబర్స్‌మెంటులో ఇంత నిర్లక్ష్యమా?




(మొదటి తరువాయి)

రూ. 9 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వల్ల చాలా నష్టం జరుగుతోందని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీ విద్యార్థులకు వందశాతం రీయింబర్స్‌మెంట్ ఇస్తామని హామీ ఇచ్చి.. పాత విధానంలోనూ రీయింబర్స్‌మెంట్ చేయలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడు పాత బకాయిలు కూడా చెల్లించాల్సిందేనని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఇంత బాధ్యత లేని ప్రభుత్వాన్ని చూడలేదు. సమస్యలు పరిష్కరించకపోతే.. ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. రాష్ట్రానికి కావాల్సిన యూరియాను ఒక సంవత్సరం ముందు నిల్వ చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తింది. కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టకుండా ఎరువులు వచ్చే మార్గంపై దృష్టి పెట్టాలని ఈటల సూచించారు.

# అమెరికాకు మాస్కో కౌంటర్

(మొదటి తరువాయి)



మాస్కోపై చర్యలు తీసుకున్నట్టేనని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. అందులో భాగంగా ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని చూస్తున్నది. ఈ క్రమంలో ఈయూ, జీ-7 దేశాలు భారత్, చైనాలపై సుంకాలు విధించాలని ట్రంప్ పాలకవర్గం ప్రతిపాదనలు చేసింది. ఇందుకు జీ-7 సభ్య దేశాలు కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలుస్తున్నది.

# అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు

(మొదటి తరువాయి)

సీపీఆర్వో జి. మల్సూర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ- తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటు-ందని, ఇందుకోసం హై పవర్ కమిటీ-ని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జి.ఓ. జారీచేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీ-ని కూడా పునరుద్దరిస్తున్నట్లు- తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని ప్రెస్ అకాడెమి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్‌పై సర్కార్ పరిశీలన

(మొదటి తరువాయి)

సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించు కున్నట్లు- స్పష్టంగా తేలినట్టు- తెలుస్తోంది. విద్యార్థి సంఘాలు కూడా ఈ రిపోర్ట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాలేజీలు విద్యా ప్రమాణాలను విస్మరించి బకాయిల చెల్లింపుల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయంటూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నకిలీ సిబ్బందిని చూపించి అనుమతులు పొందడం, సౌకర్యాలు కల్పించకుండా కోట్లు- దాచుకోవడం, తనిఖీలు తూతూమంత్రంగానే జరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా, కోట్ల రూపాయల నిధులు కాలేజీ యాజమాన్యాల మధ్య చేతులు మారుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలిం చేందుకు సిద్ధమవుతోంది. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవచ్చని సంకేతాలు ఇస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల చర్చలు ఈసారి ఎటువంటి నిర్ణయానికి దారితీస్తాయో విద్యార్థులు, కాలేజీలు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# బీహార్ సర్ ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

(మొదటి తరువాయి)

అనుసరించిన పద్ధతిలో ఏదైనా చట్టవిరుద్ధంగా కనిపిస్తే మొత్తం 'ఎస్ఐఆర్'ను రద్దు చేస్తామని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌ను హెచ్చరించింది. అయితే రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘం ఎన్నికల నిర్వహణలో సరైన నిబంధనలను పాటించిందని భావిస్తున్నట్లు పేర్కొంది. బిహార్‌లో ఈసీ చేపట్టిన ఓటరు జాబితా సర్వేకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ విషయంపై తాము అసంపూర్తి అభిప్రాయాలు వెల్లడించలేమని..అక్టోబర్ 7న తుది వాదనలు విన్న తర్వాత తీర్పును వెలువరిస్తామని అత్యున్నత న్యాయస్తానం స్పష్టం చేసింది. బిహార్ సమగ్ర ప్రత్యేక సవరణలో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మార్గదర్శకాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ముందస్తు సూచనలు ఉన్నప్పటికీ ఎన్నికల అధికారులు ఆధార్‌ను గుర్తింపు కార్డుగా అంగీకరించడానికి నిరాకరిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో న్యాయస్థానం ఎన్నికల కమిషన్ చూపిస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఆధార్ పౌరసత్వాన్ని నిరూపించలేక పోయినప్పటికీ.. అది ప్రజల గుర్తింపుకు చట్టబద్ధమైన రుజువుగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. కాగా బిహార్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఓటరు జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' పేరిట భాజపాతో కలిసి ఓట్ల చోరీకి ప్రయత్నిస్తోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. గత కొన్నేళ్లుగా దేశంలో జరుగుతున్న అన్ని ఎన్నికల్లో ఇదే విధంగా ఓట్ల చోరీ జరిగిందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

## ఖతార్ విషయంలో జాగ్రత్త..

(మొదటి తరువాయి)

హమాస్ నేతలపై 'సమ్మిట్ ఆఫ్ ఫైర్' పేరుతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. . ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఈ దాడికి బాధ్యత వహించింది. హమాస్ అగ్రశ్రేణి ఉగ్రవాద నాయకులపై నేటి చర్య పూర్తిగా స్వతంత్ర ఆపరేషన్ అని.. ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను ప్రారంభించి.. నిర్వహించిందని.. దీనికి ఇజ్రాయెల్ పూర్తి బాధ్యత వహిస్తుందని పీఎం కార్యాలయం పేర్కొంది.ఖతార్ స్టేట్ ప్రసార సంస్థ అల్ జజీరా దాడులను ధ్రువీకరించింది. ఈ క్రమంలోనే తమ వైమానిక దళం హమాస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హమాస్ ప్రతినిధి ఖలీల్ అల్-హయ్యా ఈ దాడిలో చనిపోయాడని అల్ అరేబియా తెలిపింది. ఇజ్రాయెల్ దాడిని ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిచర్య అని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని మండిపడింది. ఇజ్రాయెల్ అనాలోచిత చర్యలను సహించబోమని హెచ్చరించింది.

## కవితతో విష్ణువర్ధన్ రెడ్డి భేటీ

(మొదటి తరువాయి)

సాధించారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన విష్ణు ఓటమి చెందారు. అప్పుడు దివంగత గోపీనాథ్ బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలలో మరోసారి టికెట్ ఆశించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నిరాకరించడంతో ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి కేసీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ లో చేరినప్పటికీ రాజకీయంగా మాత్రం అంత చురుకుగా ఉండటం లేదు. మాగంటి మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికలు రావడంతో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న విష్ణును కవిత కలుసుకోవడం ఆసక్తిగా మారింది. వీళ్లిద్దరి మధ్య ఉప ఎన్నికపైనే ప్రధానంగా చర్చ జరిగినట్టు- సమాచారం. మీటింగ్ తర్వాత బయటికి వచ్చిన విష్ణు మీడియాతో మాట్లాడారు. తాను కేటీ-ఆర్ వెంటే ఉంటానని, పెద్దమ్మ ఉత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రమే కవిత ఇంటికి వెళ్లినట్టు- చెబుతున్నారు. అనంతరం జరిగిన వెంగళరావ్ నగర్ డివిజన్ సమావేశంలోనూ విష్ణు పాల్గొన్నారు.

## అమెరికాలో మళ్లీ టిక్‌టాక్..

(మొదటి తరువాయి)

బైట్‌డ్యాన్స్.. టిక్‌టాక్ యాప్‌ను డెవలప్ చేసింది. ఆ యాప్ చాలా వరకు దేశాల్లో పాపులరైంది. చైనా వ్యాపారవేత్త జాంగ్ యిమింగ్ 2021లో బైట్‌డ్యాన్స్ కంపెనీని స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయంలో బీజింగ్‌లోని హైదియాన్ జిల్లాలో ఉన్నది. కోవిడ్19 సమయంలో టిక్‌టాక్ యాప్‌కు ఫుల్ క్రేజీ వచ్చింది. ఆ యాప్‌లో వీయోలన్నీ వైరల్ అయ్యాయి. దీంతో ఆ యాప్‌కు కౌంటర్‌గా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ కూడా షార్ట్ వీడియోలను రిలీజ్ చేశాయి. రీల్స్, షార్ట్స్ పేరుతో ఆ వీడియోలు కూడా ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## మరో మూడ్రోజులు భారీ వర్షాలు

(మొదటి తరువాయి)



మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని.. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం సిద్దిపేట, రంగారాఎడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్‌తో పాటు- పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో 24.5 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది.

## సంపాదకీయం

# పాలకులు అధికార దాహం వీడాలి !



దేశంలో దాదాపు ఏడెనిమిదేళ్ల పాటు జిఎస్టీతో వాతలు పెట్టిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు, అందులో కొంత తగ్గించి నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు అంటోంది. ఆషాడం సేల్ లాగా తగ్గించి అమ్ముకోవడం అన్నది గుర్తుకు వస్తోంది. నిజానికి జిఎస్టీ ప్రకటించినప్పుడు అతిపెద్ద సంస్కరణగా అభివర్ణించారు. ఇప్పుడేమో రాబోయే తరం కోసం సంస్కరణ అంటున్నారు. ఇంతకాలం నెత్తీనోరు మొత్తుకున్నా జిఎస్టీ తగ్గించలేదు. ఇన్సూరెన్స్‌లపైనా జిఎస్టీ విధించారు. దాదాపు 11 ఏళ్ల తరవాత ఇంకా కాంగ్రెస్‌ను విమర్శిస్తూ..వారు అలా చేశారని..ఇలా చేశారని విమర్శిస్తూ పాలన సాగించడం సిగ్గుచేటు. జిఎస్టీ తగ్గింపులే కాదు...నిరుద్యోగ సమస్యకు కూడా పరిష్కారం చూపాలి. అలాగే ఉపాధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలి. యూరియ కొరతతో రైతులు నానా అగచాట్లు పడుతున్నా, వారు తిరుగుబాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదో హెచ్చరికగా చూడాలి. రైతాంగం పట్ల నిర్లక్ష్యానికి పరాకాష్టగా చూడాలి. ధరలను అదుపు చేయడం, నిరుద్యోగం లేకుండా చూడడం, పండించిన ధాన్యం లేదా వ్యవసాయ ఉత్పత్తులు కొనేలా మార్కెట్ సౌకర్యం కల్పించడం చేయాలి. బంగారం ధరలు పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయ కారణాలు చూపి తప్పించుకోకుండా ఎందుకిలా పెరుగుతున్నాయో విశ్లేషించాలి. అలాగే రాజకీయ పెత్తనం తగ్గాలి. రాజకీయంగా ఎంపిలు, ఎమ్మెల్యేలే జీతభత్యాలు తగ్గాలి. ఒక్కో ఎమ్మెల్యేకు కనీసం 4-5 లక్షల మధ్య నెలవారీ చెల్లింపులు అధికంగా భావించాలి. డబుల్ పెన్షన్లు వెంటనే ఆగాలి. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా ఖర్చులు తగ్గించు కోవాలి. ఆస్తులు అమ్ముకోవడం ద్వారా ఆస్తులు సమకూర్చాలన్న భవన సరికాదు. పొరుగుదేశాల్లో ఆందోళనలు కనువిప్పు కావాలి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు కారణాలు తెలుసుకుని మనవద్ద కూడా అలాంటివి జరక్కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. చిన్నదేశాల్లో అస్థిరతకు విదేశీ హస్తం కూడా కారణం ఉండవచ్చు. అయితే ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండడం వల్లనే తిరుగుబాట్లు వస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో విదేశీ శక్తి కూడా తోడవుతుండవచ్చు. ఎందుకంటే ధరలు, అణచివేత, నిరుద్యోగం, రైతుల సమస్యలు ఇత్యాదివన్నీ ప్రజల్లో ఆందోళనకు కారణంగా చూడాలి. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. ఇప్పుడు మోడీ కూడా పదేపదే కాంగ్రెస్‌ను బూచిగా చూపి తప్పించుకో జూస్తున్నారు. ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సి నంతగా చెందలేదు. రాజకీయ లాలూచీ, అవినీతి కారణంగా దేశం భ్రష్టు పట్టిపోతోంది. రాజ్యాంగబద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. వివేకా నందరెడ్డి హత్య జరిగి ఆరేళ్లయినా తేల్చలేక పోయారు. సిబిఐ, ఇడి కేసులు కూడా ఏమీ తేల్చడం లేదు. కాళేశ్వరం,ఇ-కార్ రేసులో అవినీతిని నిగ్గు తేల్చడం లేదు. కేసులే అపరిష్కృతంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుందన్నది పాలకులు ఆలోచన చేయాలి. నేపాల్‌లో కేవలం ఒక్క కారణంతోనే తిరుగబాటు రాలేదు. ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉంది.అనేక అంశాలు ఇందుకు తోడయ్యాయి. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగు బాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాలు మారినా ప్రజల జీవితాలు మాత్రం బాగుపడలేదు. గతంలో విప్లవాలన్నీ పాలకులు అవినీతి, అక్రమాలు,నిరంకుశంపైనే వచ్చాయి. మనదవేశంలో రోజువారీ కేసులన్నీ రాజకీయాల కు సంబంధించినవిగానే ఉంటున్నాయి. వాటి చుట్టే కోర్టు తీర్పులు తీరుగుతు న్నాయి. అనేక కేసుల్లో న్యాయం దక్కడం లేదన్న ఆందోళన ప్రజల్లో ఉంది. ఇవన్నీ కూడా మననం చేయాలి. సమీక్షించాలి. అందువల్ల న్యాయ వ్యవస్థపైనా ఇక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోకుండా భరోసా నింపాలి. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్..బంగ్లాదేశ్ దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ వ్యవస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం ఉన్నాయి. మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరని నమ్మరాదు. రైతుల ఉద్యమాన్ని తక్కువగా చూడరాదు. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతమైన నేత కూడా ప్రజాగ్రహానికి గురికాక తప్పలేదు. ఎందుకంటే కేంద్ర రాష్ట్రాల్లో విపరీతమైన అవినీతి పెరిగింది. లంచగొండి తనం వేళ్లూనుకుపోయింది. ఏపనికీ లంచం లేనిదే ఫైలు కదలడం లేదు. రాజకీయ నేతలు విలాసాలకు అలవాటు పడ్డారు. అందుకే ప్రజలు పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతు న్నారు. ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది.అధికారం లక్ష్యంగా సంక్షేమం పేరిట హద్దుమీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసర మైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు లేదు. ప్రజాధనానికి కాపలా ఉండి కేర్‌టేకర్‌గా పనిచేయాల్సిన వారు విచ్చలవిడిగా ఖర్చు పెడుతున్నారు. సామాన్యులకు న్యాయం ఎండమావిగా మారుతోంది. అధికార దుర్వి నియోగం హద్దుమీరుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతంది. అలాగే రాజకీయా నాయకులు తమ అతిని వదులుకుని ప్రజలకోసం, దేశం కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. లేకుంటే ప్రజాగ్రహం తప్పదు.


# ఇందిరమ్మ ఇళ్లకు 1435 కోట్లు విడుదల






**హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ**
ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారులకు ఇప్పటివరకు 1,435 కోట్లు విడుదల చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ వీపీ గౌతమ్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.15 లక్షల ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాగా, 1.29 లక్షల ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. వీటిలో సుమారు 20 వేల ఇళ్లు గోడల దశలో, 8,633 ఇళ్లు పైకప్పు దశలో ఉన్నాయి. పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని లబ్ధిదారులు గృహ ప్రవేశాలు కూడా చేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమచేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం 13,841 మంది లబ్ధిదారులకు రూ.146.30 కోట్లు విడుదల చేసినట్లు గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## నవజాత శిశువను సజీవంగా పాతిపెట్టారు..
### చివరికి ఏమైందంటే..?!




**లక్నో -- ప్రజా స్వేచ్ఛ**
: పదిహేనురోజుల పసికందును సజీవంగా పాతిపెట్టారు. అయితే ఓ వ్యక్తి ఆ బిడ్డ చేయికదలడాన్ని గమనించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ శిశువును కాపాడారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆదివారం మధ్యాహ్నం గోడాపూర్ గ్రామంలోని చెట్ల పొదల్లో 15 రోజుల పసికందును సజీవంగా పాతిపెట్టారు. అయితే చెట్ల మధ్య ఉన్న నేల నుంచి శిశువు చేయి కదలడం ఓ వ్యక్తి గమనించాడు. పసిబిడ్డ ఏడుపు కూడా వినబడడంతో.. అతను పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని.. పసిబిడ్డను బయటకు తీసి రక్షించారు. శ్వాస తీసుకోవడం గమనించి చికిత్స కోసం తొలుత ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కి తరలించారు. దీంతో ఆ పసిబిడ్డను ఐసియులో అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నారు. ఆ బిడ్డ ఆరోగ్యాన్ని ప్రత్యేక డాక్టర్ల బృందం పరిశీలిస్తోంది. మరోవైపు ఈ ఘటనపై జిల్లా ఎస్పీ రాజేష్ ద్వివేది తెలిపారు. ఆ బిడ్డ తల్లిదండ్రులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

## రొమేనియా ఆరోపణలను ఖండించిన రష్యా




**మాస్కో -ప్రజా స్వేచ్ఛ**
తమ గగనతలంలోకి రష్యా డ్రోన్ చొరబడిందని రొమేనియా చేసిన ప్రకటనను రష్యా తీవ్రంగా ఖండించింది. రష్యా రాయబారి వ్లాదిమిర్ లిపాయేవ్‌కి రొమేనియా విదేశాంగ శాఖ సమన్లు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. రొమేనియా ప్రకటన నిరాధారమని కొట్టిపారేసింది. ఇది ఉక్రెయిన్‌ను రెచ్చగొట్టే చర్యగా రష్యా రాయబార కార్యాలయం ఆదివారం చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రొమేనియాలో డ్రోన్ల చొరబాటులో రష్యా ప్రమేయం లేదనీ తెలిపింది.

## ఆర్మీ సామాగ్రితో కశ్మీర్ చేరుకున్న తొలి గూడ్స్ రైలు..
### ఆపిల్స్ లోడ్‌తో ఢిల్లీకి ప్రయాణం



**శ్రీనగర్ - ప్రజా స్వేచ్ఛ**
దేశ సరిహద్దుల్లో ఉన్న సైన్యానికి అవసరమైన సామాగ్రితో తొలి గూడ్స్ రైలు కశ్మీర్‌కు చేరుకున్నది.సైనికులకు అవసరమైన శీతాకాల సామాగ్రిని చేరవేసింది. ఆ తర్వాత కశ్మీర్ రైతులు పండించిన ఆపిల్స్ లోడ్‌తో ఢిల్లీకి ప్రయాణమైంది. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు లింక్ అందుబాటులోకి రావడంతో ఇది సాధ్యమైనట్లు భారత ఆర్మీ తెలిపింది. 753 మెట్రిక్ టన్నుల శీతాకాలపు స్టాక్‌తో తొలి కార్గో రైలు అనంత్‌నాగ్ చేరుకున్నట్లు పేర్కొంది. చారిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించింది.కాగా, సవాళ్లతో కూడిన హిమాలయ భూభాగంలో ఆర్మీతోపాటు ప్రజలకు ఈ రవాణా రైలు ఎంతో ఉపయోగకరమని ఆర్మీ తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరుగడంతో రోడ్లు మూసుకుపోయాయని, దీంతో నిలిపోయిన లారీల్లోని ఆపిల్స్ కుళ్లుతుండగా ఈ రైలు ద్వారా ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా ఆపిల్స్ రవాణా జరిగినట్లు పేర్కొంది. ఆర్మీకి రవాణా పరంగాను, కశ్మీర్ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఈ కార్గో రైలు సేవలు దోహదపడతాయని వెల్లడించింది. మరోవైపు అనంతనాగ్ స్టేషన్‌లో సైన్యం కోసం శీతాకాల సరుకులను దిగుమతి చేసిన తర్వాత ఈ కార్గో రైలు బుద్గాం చేరుకున్నది. అక్కడ ఆపిల్స్‌ను ఈ రైలులో లోడ్ చేశారు. సోమవారం ఉదయం జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి ఈ గూడ్స్ రైలును ప్రారంభించారు. దీంతో కశ్మీర్ ఆపిల్స్ లోడ్‌తో ఈ రైలు ఢిల్లీకి తిరుగు ప్రయాణమైంది.

# 'వంతారా'కు 'సుప్రీం' క్లీన్‌చిట్..!



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
గుజరాత్ జామ్‌నగర్‌లోని వన్యప్రాణుల పునరావాస కేంద్రం వంతారాకు భారీ ఊరట కలిగింది. సుప్రీంకోర్టు కమిటీ క్లీన్‌చిట్ ఇచ్చింది. వంతారాలో నియమాలు, నియంత్రణా చర్యలు పాటించడంపై సిట్ సంతృప్తి వ్యక్తం చేసింది. జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ పీబీ వరలేలతో కూడిన ధర్మాసనం నివేదికను రికార్డుల్లోకి తీసుకొని.. వంతారాలో నియంత్రణ చర్యల అంశంపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొంది. కమిటీ నివేదికను శుక్రవారం సమర్పించగా.. సోమవారం సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. నివేదికను అధ్యయనం చేసిన తర్వాత వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. వంతారాలో చట్టాలను పాటించడం లేదని, విదేశాల నుంచి జంతువులను, ముఖ్యంగా ఏనుగులను స్వాధీనం చేసుకొని తరలిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.ఈ అంశంపై సుప్రీంకోర్టులో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు నమోదయ్యాయి. ఆయా పిటిషన్లపై విచారణ సమయంలో పలు మీడియా నివేదికల ఆధారంగా.. ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు ఒక సిట్‌ను ఏర్పాటు చేసింది. ఆగస్టు 25న జస్టిస్ జే చలమేశ్వర్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో సిట్‌ను ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వంతారాలో జంతువులను అక్రమంగా కొనుగోలు చేసినట్లుగా ఆరోపించారు. వన్యప్రాణుల సంరక్షణ, పునరావాసం పేరుతో ఏనుగులు, పక్షులు, ఇతర జాతులను వంతారాకు అక్రమంగా తరలిస్తున్నట్లుగా పేర్కొన్నారు. భారత్‌తో పాటు వివిధ విదేశాల నుంచి జంతువులను తరలిస్తున్నారని.. ముఖ్యంగా ఏనుగులను స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. రిలియన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంతారా ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. అనంత్ అంబానీ ఆలోచనలకు అనుగుణంగా జామ్‌నగర్ రిఫైనరీ గ్రీన్‌బెల్ట్‌లో 3వేల ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేశారు. ఇది సాధారణ జంతు ప్రదర్శనశా తరహాలో కాకుండా జంతువులకు సహజ వాతావరణాన్ని కల్పించేలా శాస్త్రీయంగా రూపొందించారు.

# తహసీల్దార్ కు వినతి పత్రం అందజేత.

**-వికలాంగుల కు,చేయూత పెన్షన్ దారులకు వెంటనే పెన్షన్ పెంచాలి.**
**-పెన్షన్ దారులను మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి.**
**-పెన్షన్ దారులతో శాలిగౌరారం మండల తహసీల్దార్ -కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించిన ఎం ఆర్ .పి.ఎస్ నాయకులు.**
**- బట్ట శీను మాదిగ ఆధ్వర్యంలో**



ప్రజా స్వేచ్ఛ,,,
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం వికలాంగులకు 6000/- మరియు చేయుత పెన్షన్ దారులకు 4000/- వెంటనే పెన్షన్ పెంచాలని బట్ట శీను మాదిగ డిమాండ్ చేశాడు ఈ ధర్నాలో పాల్గొన్న సీనియర్ నాయకులు బాకీ వెంకన్న బట్ట చిన్న సైదులు పనికిరా కమలాకర్ రాచకొండ గణేష్ బట్ట నరసింహ మాట్లాడడం జరిగింది. వికలాంగులకు మరియు వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు,చేనేత కార్మికులకు,బీడీ,గీత కార్మికులకు మరియు కండరాల క్షీణత 15000/- పెన్షన్ పెంచాలని డిమాండ్ చేయడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు 4000 /-నుండి 6000,/- మరియు చేయూత పెన్షన్ దారులకు 2000/- నుండి 4000 /-ఇస్తానని ఎన్నికలో హామీ ఇచ్చి ఇప్పటికి రేవంత్ రెడ్డి సర్కార్ అధికారం లోకి వచ్చి 21 నెలలు గడిచిపోయిన ఇప్పటివరకు వారికి పెన్షన్ పెంచలేదని విమర్శించారు.పెన్షన్ పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి తీరుకు నిరసనగ ఈ రోజు వికలాంగుల హక్కుల పోరాట సమితి వి హెచ్ పి సి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ముందు పెన్షన్ దారులతో మహాధర్న నిర్వహించడం జరిగింది.తదనంతరం శాలిగౌరారం తహశీల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పెన్షన్ పెంచాలని అనేక రకాలుగా పోరాటం చేస్తూనే ఉన్నాము.పెన్షన్ దారులకు వెంటనే పెన్షన్ పెంచాలని తమరు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని మండల తహసీల్దార్ గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి శాలిగౌరారం బట్ట యాదమ్మ రాస్తాపురం పూలమ్మ బట్ట వెంకమ్మ బట్ట మల్లమ్మ చిల్లం శెట్టి సుశీల బట్ట ఫకీరు బట్ట రాములు డెంకెల అంజయ్య మిడత పెల్లి యాదమ్మ కల్లూరి చెన్నమ్మ రాస్తాపురం మణెమ్మ లింగమ్మ మైసయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వీధి దీపాల నిర్వహణ బాధ్యత సర్పంచులకే..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-అన్ని ఎల్ఈడీ లైట్లను సీసీసీకి అనుసంధానించండి**
**వాటి ఏర్పాటుకు కొత్తగా టెండర్లు పిలవాలి**
**-ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
ఎల్ఈడీ వీధి దీపాలపై రాష్ట్రమంతటా పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే నిర్వహణ అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా? లేదా? లేకపోతే కొత్తగా ఎన్ని అవసర మున్నాయో పక్కాగా అంచనా వేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ప్రతీ పోల్‌నూ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతోపాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా ఉండేందుకు పక్కగా పర్యవేక్షణ చేయాలనీ, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్ బోర్డులను మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు.రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు సమావేశంలో వ్యక్తమయ్యాయి. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ సీఎంకు నివేదించింది. గతంలో ఉన్న ఏజెన్సీ కాంట్రాక్టు ముగియటంతో ఇప్పుడు చాలాచోట్ల లైట్లు వెలగటం లేదని, నిర్వహణ కూడా సరిగా జరగలేదని అధికారులు తెలిపారు. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సీఎం వారిని ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు. వాటి తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలనీ, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు వాటికే అప్పగించాలని సూచించారు. నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని ఆదేశించారు.ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్ ల ఏర్పాటు, నిరంతరం అవి పనిచేస్తున్నాయా? లేదా? ఏయే ప్రాంతాల్లో ఇబ్బందులున్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలని సీఎం అన్నారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.8 కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తోందనీ, విద్యుత్తును ఆదా చేసేందుకు వీలుగా సోలార్ పవర్‌ను వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. కోర్ అర్బన్ సిటీ ఏరియాతో పాటు ఔటర్ అవతల ఉన్న మున్సిపాలిటీల్లోనూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీలతో పాటు కొన్ని మున్సిపాలిటీల్లో కొత్త గ్రామాల విలీనం, గ్రామాల మార్పులు చేర్పులు జరిగాయని అన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సూచించారు. కోర్ అర్బన్ సిటీతో పాటు మున్సిపాలిటీల్లో ఎల్ఈడీ లైట్లకు కూడా టెండర్లు పిలవాలని ఆయన ఆదేశించారు. సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పంచాయితీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, కోర్ అర్బన్ ఏరియా మున్సిపల్ సెక్రటరీ ఇలంబర్తి, మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శ్రీజన పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేసిన

## తెలంగాణ సిఎస్సి వి ఎల్ ఈ డిజిటల్ సేవాసమితి



జోగులాంబ గద్వాల జిల్లా , ప్రజా స్వేచ్ఛ
తెలంగాణ సిఎస్సి విఎల్ ఇ డిజిటల్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి స్టేట్ సర్వీసులు ఇచ్చి ఆదుకోవాలి వినతి పత్రం అందజేయడం జరిగింది.
రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆన్లైన్ ద్వారా చేయుటకు సి ఎస్ సి (కామన్ సర్వీసెస్ సెంటర్) డిజిటలసేవ సెంటర్లకు అనుమతినివ్వాలి.
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పౌర సేవలను, రెవెన్యూ సర్వీసులు, ఆర్ టీ ఏ సర్వీసులు, లేబర్ కార్డు సర్వీసులు ఆన్లైన్ ద్వారా అప్లికేషన్లు చేసుకునే సేవలను సిఎస్సి కామన్ సర్వీస్ సెంటర్ లకు చేయుటకు అవకాశం కల్పించాలని గ్రామస్థాయిలో ప్రజలకు, పౌర సేవలను మరింత చేరువ అయ్యే అవకాశం ఉన్నందున సి ఎస్ సి ద్వారా చేయుటకు అనుమతిని ఇవ్వాలనికోరుతూ జిల్లా కలెక్టర్ కు సోమవారం తెలంగాణ సిఎస్సి విలేజ్ డిజిటల్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా సిఎస్సి సెంటర్ నిర్వాహకులు మాట్లాడుతూ!గత 12 సంవత్సరాలుగా గ్రామాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రభుత్వ సేవలను డిజిటల్ లిటరసీ మిషన్ కంప్యూటర్ శిక్షణ, ఆరోగ్యశ్రీ ఆయుష్మాన్ భారత్, పిఎంకెవి, వంటి అనేక కార్యక్రమాలను పట్టణ గ్రామీణ స్థాయి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆన్లైన్ అప్లికేషన్లను చేస్తూ గ్రామస్థాయిలో ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటున్న మాకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను అప్లికేషన్ చేసే అవకాశం కల్పించమన్నారు. ఈ కార్యక్రమంలో శివన్న,దేవర్ల శివశంకర్ గౌడ్,జి వీరన్న, విష్ణు కుమార్,కోలన్న, రామాంజనేయులు, మలిగపోగు సుధాకర్‌జగదీశ్వర్, ఎన్ రాములు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ ఎంపీడీవో కార్యాలయానికి బ్లీచింగ్ బస్తాలు అందజేసిన దివిస్ లేబరేటరీస్ కంపెనీ



యాదాద్రి భువనగిరి జిల్లా, ప్రజా స్వేచ్ఛ
చౌటుప్పల్ మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో, సోమవారం రోజున దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ వారు 5,11,000/బిరూపాయల విలువగల 1000 బ్లీచింగ్ బస్తాలను, ఎంపీడీవో సందీప్ కుమార్ గారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... చౌటుప్పల్ మండలంలోని ఉన్న 26 గ్రామపంచాయతీలలో పారిశుద్ధ్యము మెరుగునకు దివి సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. గ్రామాలలోని మురికి కాలువ లో, నీరు నిల్వ ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ ను చల్లడం వల్ల దోమల నుండి మలేరియా, డెంగ్యూ, జబ్బులను అరికట్టవచ్చునని అన్నారు. గ్రామపంచాయతీ వాళ్లు అందరూ బ్లీచింగ్ బ్యాగులను సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అంజిరెడ్డి, సూపరిండెంట్ విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, దివిస్ ప్రతినిధులు గోపి, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 17న మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్




బషీర్ బాగ్, ప్రజా స్వేచ్ఛ
అఖిల భారతీయ తెరాపంత్ యువక్ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 17న మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని సంస్థ నేషనల్ ప్రెసిడెంట్ రమేష్ డాగ్ , ప్రధాన కార్యదర్శి అమిత్ నహతా, నేషనల్ ఇన్చార్జ్ హితేష్ బాండియా, నేషనల్ పోయి ఇంచార్జ్ సౌరబ్ పట్వారి లు తెలిపారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మూడు లక్షల యూనిట్స్ రక్త సేకరణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో 100కు పైగా శిబిరాల ఏర్పాటుతో, నగరంలో సాలార్జంగ్ మ్యూజియం, గోల్కొండ ఫోర్ట్, ఎయిర్పోర్ట్ ఈ టి సి వంటి ప్రధాన కేంద్రాలలో రక్త సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ రక్తదాన అమృత మహోత్సవం 2.0 ను దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభం చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్త సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంపై ప్రజా వేదిక లో సమీక్ష




మాడుగులపల్లి/ ప్రజా స్వేచ్ఛ
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధుల ద్వారా చేపట్టిన పనులపై 4వ విడత సామాజిక తనికి తేది. 204 నుండి 2025 వరకు సంవత్సర కాలం లో 265పనులకు గాను కూలీల వేతనంగా 3,81,09,879 రూపాయలు, సామాగ్రి కి 970293మొత్తం కలిపి 3,90,80,172 రూపాయలు మరియు పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సీసీ రోడ్, జిపి బిల్డింగ్ వారివి 72పనులకు 3,46,87,348 రూపాయలు ఖర్చు చేసిన పనులకు సామాజిక తనిఖీ తేది. 01.09.2025 నుండి 14.09.2025 వరకు గ్రామ లలో తనిఖీ నిర్వహించి వచ్చిన అంశాలపై మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా వేదిక నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో నైపుణ్యం లేని పనులు చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి గ్రామీణ కుటుంబ సభ్యులకి ఒక ఆర్థిక సంవత్సరానికి వంద రోజులు ఉపాధి చట్టబద్ధమైన హామీ ఇచ్చే పథకం ఈ పథకం పనిచేసే హక్కులు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి అందిస్తుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాలకు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది. కార్యక్రమానికి ప్రైసైడింగ్ ఆఫీసర్ గా అడిషనల్ డిఆర్డిఓ నవీన్ కుమార్, డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ చకిలం వేణుగోపాల్ రావు, క్యూ సి ఫసియోద్దిన్, ఎంపీడీఓ సంగీత, ఏపీవో నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఆర్ పి అమే చెన్న కేశవులు, ఈ సి బాలు నాయక్, టి ఏ లు యాదగిరి, శ్రీను సత్యనారాయణ శోభ, సౌజన్య, సి ఓ హరీష్, కాషీమ్ సతీష్, నాగేందర్, ఇశ్రత్ ఎఫ్ ఏ లు రాజేశ్వరి సాలయ్య, శ్రీనివాస్ రెడ్డి, సైదులు రవీందర్, సుకన్య, డిఆర్పీలు, మొదలగు వారు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే లో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**-అర్జీదారులతో స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు**

**-సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం**



**జగిత్యాల జిల్లా ,ప్రజా స్వేచ్ఛ** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 12 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.


# చెరువు ల నుండి అక్రమంగా మట్టి నీ తరలించి సొమ్ము చేసుకుంటున్న మట్టి మాఫియా

**ఇదేమిటని ప్రశ్నించిన విలేకరిపై బెదిరింపులు**



**కొండమల్లేపల్లి , ప్రజా స్వేచ్ఛ** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన నల్లకుంట చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తూ ఇది ఏమిటి అని ప్రశ్నించిన విలేకరిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతూ ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో నీ ఇష్టం ఉన్నది రాసుకో నాకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయి నీ ఇష్టం వచ్చినట్టు రాసుకో అని భయబ్రాంతులకు గురి చేశారు మండల ప్రజలు ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందా లేక అధికార పార్టీ అండదండలు ఉన్నాయా సమాజ శ్రేయస్సు కోసం ప్రజల్ని మేలుకొలుపే అను నిత్యం సమస్యల పైన పోరాడే ఒక పత్రిక విలేఖరి తోనే ఇంత బరితెగింపుగా మాట్లాడుతున్నారు అంటే అధికార పార్టీ అండదండలు ఉన్నాయా లేక అధికారుల కనుసైగల్లో నడుస్తున్నాయా అని చర్చించుకుంటున్నారు ఇప్పటికే లక్షల రూపాయల విలువైన మట్టిని తువ్వేశారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మట్టి మాఫియా పై చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి

# విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి...



**పాపన్నపేట, ప్రజా స్వేచ్ఛ** విద్యుత్ షాక్ తో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కథనం ప్రకారం...యూసుఫ్ పేట గ్రామానికి చెందిన మిన్ పూర్ శేఖర్(30) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తు జీవనాన్ని కొనసాగిస్తున్నాడు కాగా .సోమవారం అతను పొలం పనుల్లో భాగంగా పంట చేను వద్దకు వెళ్లాడు.పొలం పనులు చేస్తుండగా పొలం గట్టుపై ఉన్న కరెంట్ వైర్ తగిలి విద్యుత్ షాక్ కు గురయ్యాడు.అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు.కుటుంబీకులు అక్కడికి చేరుకొని కొన ఊపిరితో ఉన్న అతన్ని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందాడని చెప్పారు.మృతుడి భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

'

# టీవీ5 రిపోర్టర్ ,సిటీ కేబుల్ దండ భాస్కర్ చిత్రపటానికి నివాళులు...

**సిద్ధార్థ**



**మిర్యాలగూడ ,ప్రజా స్వేచ్ఛ** మిర్యాలగూడ పట్టణం ఈదులగూడకు చెందిన సీనియర్ రిపోర్టర్ దండ భాస్కర్, టీవీ5 మరియు సిటీ కేబుల్ ఇటీవలే పరమపదించారు. కాగా ఈరోజు వారి దశదినకర్మను వారి కుటుంబ సభ్యులు పట్టణంలోని షాబునగర్లో గల ఏఆర్సి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఇట్టి పెద్దకర్మకు మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి తో కలిసి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు నల్లమోతు సిద్ధార్థ పాల్గొని భాస్కర్ చిత్రపటానికి పూలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ధనావత్ చిట్టిబాబు నాయక్, ధనావత్ బాలాజీ నాయక్, ఆంగోతు హాతిరాం నాయక్, గంటా శ్రావణ్ రెడ్డి, ఐల వెంకన్న, ఎర్రమల దినేష్, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, రమావత్ వినోద్ నాయక్, లింగా నాయక్, రమేష్ నాయక్, బాలా నాయక్, రవి నాయక్, సీనియర్ పత్రిక విలేకరులు మరియు ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లు మరియు భాస్కర్ కుటుంబ సభ్యులు వారి బంధుమిత్రులు తదితరులు ఉన్నారు..

# మేడారానికి మహర్దశ





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## 150 కోట్లతో అభివృద్ధి

**ప్రజా స్వేచ్ఛ ...** వెయ్యేళ్ల చరిత్ర గల మేడారం దేవాలయ విశిష్టత మరో వెయ్యేళ్లపాటు వెలుగొందేలా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ మేరకు మేడారం కీర్తి, గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసేలా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

**ములుగు:**

పగిడిద్దరాజు, గోవిందరాజు వంశస్తుల ఆచారాలు, సంప్రదాయాల ప్రకారమే మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయ నిర్మాణ పనులు ఉంటాయని మంత్రి సీతక్క తెలిపారు. వెయ్యేళ్ల చరిత్ర గల మేడారం దేవాలయ విశిష్టత మరో వెయ్యేళ్లపాటు వెలుగొందేలా అభివృద్ధి పనులు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ మేరకు మేడారం కీర్తి, గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసేలా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాల ప్రకారమే జరుగుతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మేడారంలో పర్యటించి సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ, అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..**

'సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి విషయానికి కొస్తే డిజైన్ రూపకల్పనలో ఎవరి ప్రమేయం ఉండదు. పూజారులు, స్థానికుల అభిప్రాయం మేరకే డిజైన్లు రూపొందిస్తాం. పూజారుల ఆలోచనల మేరకే ఆయన అభివృద్ధికి అడుగులు వేస్తాం. సమ్మక్క-సారలమ్మ తల్లులపై సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో నమ్మకం ఉంది. తల్లుల దీవెనలతో ఇక్కడి నుంచి పాదయాత్ర చేసి తాను అధికారంలోకి వచ్చినట్టు ముఖ్యమంత్రి ఎన్నోసార్లు చెప్పారు. భక్తులకు మరింత సులభంగా తల్లుల దర్శన భాగ్యం కల్పించేందుకు పూజారుల సూచన మేరకు గుడి విస్తీర్ణాన్ని పెంచుతున్నాం.యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టి మహాజాతర లోపు నిర్మాణాలు పూర్తి చేస్తాం. ఆదివాసీ జాతి బిడ్డగా నేను, సమ్మక్క-సారలమ్మ తల్లుల భక్తుడిగా సీఎం రేవంత్ ప్రత్యేకంగా దృష్టి సారించి మేడారం గుడిని అభివృద్ధి చేస్తున్నాం. మేడారంలో భక్తులకు తల్లుల దర్శనంతోపాటు, వారి త్యాగాల చరిత్రను తెలియచెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే మేడారంలో రేవంత్ రెడ్డి పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు. పూజారులు చెప్పినట్లే నడుచుకుంటున్నాం. ఎక్కడా బయట వ్యక్తుల ప్రమేయం ఉండదు. తప్పుడు ప్రచారం చేస్తే తల్లుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది' అని చెప్పారు.

# జిల్లా కలెక్టర్ చేతుల మీద ఫోటో ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ




**ఎల్లారెడ్డిపేట, ప్రజా స్వేచ్ఛ** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గారి చేతుల మీదుగా సెప్టెంబర్ నెల 19.20.21 తేదీలలో తెలంగాణ రాష్ట్ర ఫోటో & వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగు ఫోటో ట్రేడ్ ఎక్స్ పో హైదరాబాదులోని ఓం కన్వెన్షన్ నార్సింగి హైదరాబాద్ లో జరుగు ఎగ్జిబిషన్ వివరాల పోస్టర్ ను కలెక్టర్ గారు & ఎండి గౌస్ బాయ్ మరియు ఎల్లారెడ్డిపేట మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తెలంగాణ ఫోటో & వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కార్యదర్శి ముత్యాల ప్రభాకర్ రెడ్డి మండల అధ్యక్షులు ఎండి హాజీముద్దీన్ మాట్లాడుతూ ఈ యొక్క ఫోటో ట్రేడ్ ఎక్స్పో గ్రామీణ ప్రాంత ఫోటో మరియు వీడియో గ్రాఫర్స్ కొరకు ఎంతగానో ఉపయోగపడుతుందని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి కొత్త కొత్త కెమెరాలు. టెక్నాలజీలు AI టెక్నాలజీ మొదలగు అంశాలను నేర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని మిక్సింగ్ యూనిట్స్. ఆల్బమ్ డిజైనర్స్. ల్యాబ్ ప్రింటర్స్. వారికి కూడా కొత్త కొత్త పరికరాలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు కావున గ్రామీణ ప్రాంత మరియు పట్టణ ప్రాంత ఫోటో వీడియో గ్రాఫర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఫోటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కార్యదర్శి ముత్యాల ప్రభాకర్ రెడ్డి అధ్యక్షులు మహమ్మద్ అజీముద్దీన్ ప్రధాన కార్యదర్శి పెంజర్ల తిరుపతి యాదవ్ మహమ్మద్ షాదుల్ ఉపాధ్యక్షులు మారోజు కుబేర స్వామి షాడా శేఖర్ రెడ్డి.మారోజు నరసింహ చారి బసవపురం కృష్ణ . వేముల శ్రీధర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు

# పెద్దవంగర మండలంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్, సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పెద్దవంగర ,ప్రజా స్వేచ్ఛ** పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు. పెద్దవంగర మండలంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 32 మంది లబ్దిదారులకు 32,03,712/- లక్షల రూపాయల విలువైన కళ్యాణలక్ష్మి-షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం, 14 మంది అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందిన లబ్దిదారులకు 5,36,500 /- లక్షల రూ, సీఎం సహాయనిధి చెక్కులను కూడా అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయని, పేదల పెళ్లిళ్లలో ఈ పథకాలు భరోసా కలిగిస్తున్నాయని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ఒక అండగా నిలుస్తోందని, ఈ సాయంతో ఎన్నో కుటుంబాలు తిరిగి నిలబడ్డాయని పేర్కొన్నారు. ప్రతి అర్హుడి ఇంటికీ ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నాను. పేద ప్రజల సమస్యలను నా సమస్యలుగా భావించి, ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా శ్రమిస్తాను అని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు.చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ -తమ ఆర్థిక సమస్యల పరిష్కారంలో సహకరించినందుకు ఎమ్మెల్యే కి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, లబ్దిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

'

# బిజినెస్

## బంగారం కొనేవారికి గుడ్‌న్యూస్.. రికార్డుస్థాయి నుంచి తగ్గిన ధర..!

బంగారం ధరలు కొనుగోలుదారులకు స్వల్ప ఊరట ఇచ్చాయి. ఇటీవల వరుసగా ధరలు పైపైకి కదులుతూ సరికొత్త గరిష్ఠాలను తాకాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం రూ.500 తగ్గింది. 24 క్యారెట్ల పసిడి రూ.1,13,300కి చేరింది. దాంతో వరుస నాలుగు రోజుల ర్యాలీకి బ్రేక్ పడినట్లయ్యింది. అదే సమయంలో 24 క్యారెట్ల బంగారం ధర సైతం రూ.500 తగ్గి తులం ధర రూ.1,13,800కి తగ్గింది. మరో వైపు వెండి రూ.300 పెరిగి కిలోకు రూ.1,32,300కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తుండడంతో వెండి ధర పెరుగుతూ వస్తుందని బులియన్ వ్యాపారులు పేర్కొన్నారు. బలహీనమైన యూఎస్ లేబర్ మార్కెట్ డేటా తర్వాత పెట్టుబడిదారులు ద్రవ్య పరపతి విధానంపై దృష్టి




సారించారు.ప్రస్తుతం క్యాలెండర్ సంవత్సరంలో వెండి ధరలు కిలోకు రూ.22,600 పెరిగింది. గత సంవత్సరం డిసెంబర్ 31న వెండి కిలోకు రూ.89,700 వద్ద కొనసాగింది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ మాట్లాడుతూ సోమవారం బంగారం తక్కువగా ట్రేడ్ అయ్యిందని.. వ్యాపారులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశానికి ముందు కొనుగోళ్లు తగ్గడంతో మధ్యస్తంగా బేరిష్ జోన్‌లో ట్రేడవుతుందన్నారు. ఫెడ్ రిజర్వ్ సమావేశం 16న మొదలై.. 17న ముగియనున్నది. అదే రోజున విధాన నిర్ణయం ప్రకటించనున్నది. చైర్మన్ జెరోమ్ పావెల్ విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫెడ్ అధికారుల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఫెడ్ రిజర్వ్ భేటీ ప్రాధాన్యం సంతరించుకున్నది. ప్రపంచ మార్కెట్లలో బంగారం ఔన్సుకు స్వల్పంగా 3,645.12 డాలర్లకు చేరుకుంది. వెండి ఔన్సుకు 42.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

## వాహన ఉత్పత్తిలో తగ్గుదల

### ఆగస్టు విక్రయాల్లో 9 శాతం తగ్గుదల



న్యూఢిల్లీ

వాహనాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది ఆగస్టులో నెలలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తిలో 4.1 శాతం తగ్గుదల చోటు చేసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు తయారీదారులు డీలర్లకు పంపిన డెలివరీలు దాదాపు 9 శాతం తగ్గాయి. వాహనాలపై జిఎస్‌టిని తగ్గించనున్నామని కేంద్రం ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా అమ్మకాలు తగ్గాయి. ధరల తగ్గింపు ఆశతో వినియోగదారులు కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారని.. దీంతో అనేక డీలర్‌షిప్‌లలో రిటైల్ అమ్మకాలు దెబ్బతిన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఆగస్టు చివరి నాటికి కార్ల ఇన్వెంటరీ నిల్వలు 60 రోజులకు చేరుకున్నాయి. మొత్తం ఛానల్ ఇన్వెంటరీ దాదాపు 6,00,000 యూనిట్లకు చేరింది. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి డెలివరీలు 8 శాతం తగ్గాయి. ఎంఅండ్‌ఎం 9 శాతం కంటే ఎక్కువ, హ్యుందాయ్ మోటార్ ఇండియా డిస్పాచ్‌లు సుమారు 10 శాతం తగ్గాయి.'గడిచిన ఆగస్టులో ప్యాసింజర్ వెహికల్ అమ్మకాలు గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 8.8 శాతం తగ్గి 3,22,000 యూనిట్లకు చేరాయి. మొత్తం ప్రయాణికుల వాహనాల ఉత్పత్తి 4 శాతం తగ్గి 1,25,000 యూనిట్లకు పరిమితమయ్యాయి." అనిసొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియోమ్) డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ పేర్కొన్నారు. ద్వి, త్రిచక్ర వాహన అమ్మకాలు 7.1 శాతం పెరిగి 18.3 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. స్కూటర్ అమ్మకాలు 12.7 శాతం, మోటార్‌సైకిళ్లు 4.3 శాతం చొప్పున పెరిగాయి. సియోమ్ గణాంకాల ప్రకారం.. ఆథర్ డిస్పాచ్‌లు దాదాపు 70 శాతం పెరిగి 22,757 యూనిట్లకు చేరాయి. హీరో మోటోకార్ప్ 5.4 శాతం వృద్ధిని నమోదు చేయగా..రాయల్ ఎన్‌ఫీల్డ్ డిస్పాచ్‌లు 56 శాతం పెరిగాయి. గడిచిన ఆగస్టులో మూడు చక్రాల వాహనాల అమ్మకాలు 8.3 శాతం పెరిగి 76,000 యూనిట్లకు చేరాయి.

## స్విగ్గీ నుంచి కొత్త ఫుడ్ డెలివరీ




న్యూఢిల్లీ

ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ప్రత్యేక డెలివరీ యాప్ 'టోయింగ్' పేరిట కొత్త యాప్‌ను ఆవిష్కరించింది. తొలుత పూణెలో అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌ను విద్యార్థులు, యువత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని తెచ్చిందని తెలుస్తోంది. ఇందులో రూ.100-150కే ఆహారాన్ని అందించనుంది. కస్టమర్ల నుంచి సర్జ్ ఫీజు వసూలు చేయడం లేదని ఆ సంస్థ పేర్కొంది.

## న్యూమెరోస్ మోటార్స్ నుంచి డిప్లోస్ మాక్స్ ప్లస్ విడుదల




బెంగళూరు

విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ న్యూమెరోస్ మోటార్స్ కొత్తగా డిప్లోస్ మ్యాక్స్ ప్లస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. డిప్లోస్ మాక్స్‌లో 4కిలోవాట్ డ్యూయల్ లిక్విడ్ ఇమర్షన్ కూల్డ్ బ్యాటరీ, 156 కి.మీ రేంజ్, గంటలకు 70 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో ప్రయాణించగలదని ఆ కంపెనీ పేర్కొంది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1.21 లక్షలుగా నిర్ణయించింది.

## షేక్‌హ్యాండ్ ఇవ్వని టీమిండియా క్రికెటర్లు.. నిరసన వ్యక్తం చేసిన పాకిస్థాన్

దుబాయ్

ఆసియాకప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ ఘటన తర్వాత రెండు దాయాది దేశాలు తలపడ్డాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లు .. పాకిస్థాన్ క్రికెటర్లతో కరచాలనం చేసేందుకు నిరాసక్తత ప్రదర్శించారు. దీన్ని పాకిస్థాన్ జట్టు ఖండించింది. ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ముందు తన నిరసన వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఆలస్యంగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దీనిపై ప్రకటన రిలీజ్ చేసింది. టీమిండియా చర్యలు క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉన ్నట్లు పీసీబీ ఆ స్టేట్మెంట్‌లో చెప్పింది.ఆదివారం దుబాయ్‌లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసు కున్నాయి. భారత్, పాక్ కెప్టెన్లు టాస్ సమయంలో షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు. సూర్యకుమార్ యాదవ్, సల్మాన్ ఆఘాలు.. క రచాలనం చేయకుండానే టాస్‌లో పాల్గొని వెళ్లిపోయారు. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత టీమిండియా క్రికెటర్లు సైలెంట్‌గా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. టార్గెట్ 128 చేసే క్రమంలో




భారీ సిక్సర్‌తో సూర్య ఇన్నింగ్స్ ముగించేశాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత సాధారణంగా ప్రత్యర్థి జట్ల ప్లేయర్లకు షేక్‌హ్యాండ్ ఇస్తారు. కానీ సూర్య, దూబేలు.. పాక్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. గెలిచిన, ఓడిన జట్ల ప్లేయర్లు షేక్‌హ్యాండ్ ఇచ్చుకోలేదు.భారత క్రికెటర్లు ప్రవర్తించిన తీరు పట్ల పాకిస్థాన్ టీమ్ మేనేజర్ నవీద్ చీమా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇది క్రీడా స్ఫూర్తికి విరుద్ధం అని ఆయన అన్నారు. నిరసనలో భాగంగా తమ కెప్టెన్ను పోస్టు మ్యాచ్ సెర్మనీకి పంపలేదని ఆయన స్టేట్మెంట్‌లో తెలిపారు.పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ ఇవ్వకపోవడం పట్ల మ్యాచ్ తర్వాత సూర్యకుమార్ స్పందించారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు.

## ఓవల్ టెస్టులో చిరస్మరణీయ బౌలింగ్..

### సిరాజ్‌ను వరించిన ఐసీసీ అవార్డు

ఇంగ్లండ్ పర్యటనలో సంచలన బౌలింగ్‌తో మ్యాచ్ విన్నర్‌గా అవతరించిన మహమ్మద్ సిరాజ్ ఐసీసీ అవార్డుకు ఎంపికయ్యాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో చివరిదైన ఓవల్ టెస్టు లో సంచలన బౌలింగ్‌కుగానూ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు అందుకున్నాడీ స్పీడ్‌స్టర్. ఆగస్టు నెలకుగానూ అతడికి ఈ గౌరవం లభించింది. ఈ అవార్డు కోసం మ్యాట్ హెన్రీ(న్యూజిలాండ్), జైడెన్ సీల్స్ (వెస్టిండీస్) పోటీపడగా.. అత్యధిక ఓట్లతో భారత పేస్ గన్ విజేతగా నిలిచాడు.'నాకంటే జట్టులోని సహచరులకు, సహాయక సిబ్బందికి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు చెందుతుంది. వారి నిరంతరం ప్రోత్సాహం, నాపై వాళ్లకున్న నమ్మకమే నన్ను ముందుకు నడిపిస్తోంది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటింగ్ లైనప్‌లోని ఆటగాళ్లకు వాళ్ల సొంత గడ్డపైనే బౌలింగ్ చేయడం సవాల్‌గా తోచింది. ఒకరకంగా నాలో ఉత్తమ ప్రదర్శన వెలుగులోకి రావడానికి కారణం' అదే అని సిరాజ్ వెల్లడించాడు.




**బుమ్రా గైర్హాజరీలో**

ఇంగ్లండ్ పర్యటనలో ఐదుకు ఐదు మ్యాచ్‌లు ఆడిన సిరాజ్.. ఏకంగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేసి అందర్నీ ఆశ్చర్చపరిచాడు. తన ఫిట్‌నెస్‌తో పాటు చెక్కుచెదరని ఏకాగ్రతతో అందరి ప్రశంసలు అందుకున్న మియా భాయ్.. నిర్ణయాత్మక ఓవల్ టెస్టులో నిప్పులు చెరిగాడు. బుమ్రా గైర్హాజరీలో పేస్ దళం బాధ్యతలను భుజాన వేసుకున్న అతడు తొలి ఇన్నింగ్స్‌లో 5, రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు.. మొత్తంగా 9 వికెట్లు పడగొట్టాడు.తద్వారా భారత్‌కు చిరస్మరణీయ విజయంలో కీలకపాత్ర పోషించాడీ హైదరాబాదీ పేసర్. దాంతో, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా 2-2తో సిరీస్ సమం చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చింది. ఐదు టెస్టుల్లో కలిపి 23 వికెట్లు తీసిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు గెలుచుకున్నాడు.

# స్పోర్ట్స్

## ఆర్సీబీ కెప్టెన్ ఖాతాలో రెండో ట్రోఫీ..

### 11 ఏళ్లకు ఛాంపియన్‌గా సెంట్రల్ జోన్..!




ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ట్రోఫీ అందించిన రజత్ పాటిదార్ మరో టైటిల్ గెలుపొందాడు. అతడి సారథ్యంలోని సెంట్రల్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. దాదాపు 11 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ టైటిల్‌ను ముద్దాడింది ఆ జట్టు. ఐదు రోజుల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్లో సౌత్ జోన్ పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీతో జట్టుకు భారీ స్కోర్ అందించిన పాటిదార్.. తన మార్క్ కెప్టెన్సీతో సెంట్రల్ కలను సాకారం చేశాడు.బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానంలో జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ ఉత్కంఠ విజయంతో మురిసింది. ఒకదశలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. చిరస్మరణీయ విక్టరీ సాధించింది. సౌత్ జోన్ నిర్దేశించిన 65 పరుగుల లక్ష్య ఛేదనలో సెంట్రల్ జట్టు టాపార్డర్ విఫలమైంది. గుర్జప్‌నీత్ సింగ్, అంకిత్ కుమార్ విజృంభణతో 24 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.ఆ పరిస్థితుల్లో మరో రెండు వికెట్లు పడితే సౌత్ జోన్ ఛాంపియన్ అయ్యేది. కానీ, అక్షయ్ వడ్కర్(19 నాటౌట్), యశ్ రాథోడ్ (13 నాటౌట్)లు అద్భుతంగా ఆడి ప్రత్యర్థి ఆశలపై నీళ్లు చల్లారు. ఈ ఇద్దరూ కీలక ఇన్నింగ్స్ ఆడగా ఆరు వికెట్లతో జయభేరి మోగించింది సెంట్రల్. తద్వారా 11 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ కలను సాకారం చేసుకుంది.

**యశ్, పాటిదార్ శతక గర్జన**

తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. సెంట్రల్ బౌలర్లు సరన్ష్ జైన్(5-49), కుమార్ కార్తికేయ(4-53) ధాటికి ఆ జట్టు 149 పరుగులకే ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్‌కు ఓపెనర్ డానిష్ మలేవర్(53) శుభారంభమిచ్చాడు. అనంతరం యశ్ రాథోడ్ (194), కెప్టెన్ రజత్ పాటిదార్(101)లు సౌత్ జోన్ బౌలర్లను ఉతికారేస్తూ సెంచరీలతో చెలరేగారు.యశ్, పాటిదార్ విధ్వంసంతో సెంట్రల్ జట్టు 511 పరుగులతో భారీ ఆధిక్యం సాధించింది. అయితే.. రెండో ఇన్నింగ్స్‌లో సౌత్ బ్యాటర్లు అసమానంగా ఆడారు. అంకిత్ శర్మ(99), అండ్రే సిద్దార్థ్ (84), స్మరణ్ రవిచంద్రన్ (67)లు అర్ధ శతకాలతో విజృంభించారు. దాంతో.. 426 రన్స్ చేసిన సౌత్ ప్రత్యర్థికి 65 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.






## సుధీర్ బాబు జటాధర థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

సక్సెస్, ఫెయిల్యూర్స్‌తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్న యాక్టర్లలో ఒకడు సుధీర్ బాబు. ఈ టాలెంటెడ్ యాక్టర్ ఈ సారి రూటు మార్చి సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. సుధీర్ బాబు నటిస్తోన్న సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ జటాధర.వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ తెలుగు, హిందీ బైలింగ్యువల్ సినిమాగా వస్తోంది. కాగా మేకర్స్ ఎన్నో రోజులుగా విడుదలపై నెలకొన్న డైలామాకు తెరదించారు. ఈ మూవీని నవంబర్ 7న తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ కూడా త్వరలో మొదలు కానున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్.ఓ వైపు శివుడు మరోవైపు చేతిలో త్రిశూలాన్ని పట్టుకున్న సుధీర్‌బాబు, ఇంకోవైపు ఉగ్రరూపంలో కనిపిస్తున్న సోనాక్షి సిన్హా లుక్స్‌ను మేకర్స్ ఇప్పటికే విడుదల చేయగా.. సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ భామ సోనాక్షి సిన్హా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శిల్పా శిరోద్కర్ కీలక పాత్ర పోషిస్తోంది.సుధీర్ బాబు నటించిన హరోం హర, మా నాన్న సూపర్ హీరో సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయని తెలిసిందే. దీంతో తన ఆశలన్నీ జటాధర సినిమాపైనే పెట్టుకున్నాడు. మరి ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ సుధీర్‌బాబుకు ఎంతలా కలిసొస్తుందో చూడాలి.

## సపోర్ట్ లేకుంటే రాణించడం కష్టమే

### నటి ప్రియాంక చోప్రా మనోగతం

చిత్రసీమలో బ్యాక్ గ్రౌండ్ సపోర్టు లేకుండా రాణించడం కష్టమే అని నటి ప్రయియాంక చోప్రా అభిప్రాయ పడ్డారు. 2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండ్రస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడించారు. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న వారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నిచడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు- ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించానని ప్రియాంక తెలిపారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. 2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను.

ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం " S 29లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.


## కేవలం నా ఫోకస్ వాటిపైనే



రెండు దశాబ్దాలుగా స్టార్ హీరోల చిత్రాలతో మెప్పిస్తూ ఉన్నారు త్రిష. ఇప్పుడు 2.0 వెర్షన్ అన్నట్టు.. ఇంకా అందంగా కనిపించడానికి కృషి చేస్తున్నారు. నటన తప్ప ఇంకే విషయం మీదా నా ఫోకస్ లేదు. ఫ్యాన్స్ ని ఎంటర్‌టైన్ చేయడానికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నానంటున్నారు త్రిష.రెగ్యులర్ కమర్షియల్ సినిమా అయినా, చారిత్రాత్మక సబ్జెక్ట్ అయినా పెర్ఫార్మెన్స్ ప్లస్ గ్లామర్ కి స్కోప్ ఉంటే, మేకర్స్ ఫస్ట్ ఛాయిస్ త్రిషే అవుతున్నారు. తన సినిమాల్లో త్రిషను బ్యాక్ టు బ్యాక్ తీసుకోవడానికి రీజన్ కూడా అదేనని ఈ మధ్య రివీల్ చేశారు స్టార్ కెప్టెన్ మణిరత్నం.ఈ ఏడాది ఆల్రెడీ ఒకటికి నాలుగు సినిమాలతో పలకరించారు త్రిష. హిట్టూ, ఫ్లాపులూ సమానంగా తీసుకుంటానని చెబుతున్నారు ఈ లేడీ. అన్నీ పర్ఫెక్ట్ గా ఉంటే, సూర్యతో నటించే కరుప్పు కూడా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. సూర్య, త్రిష జోడీకి కోలీవుడ్‌లోనే కాదు.. సినిమా సర్కిల్స్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఆ మేజిక్‌ని కరుప్పులో చూడ్డానికి మేం రెడీ అంటున్నారు ఫ్యాన్స్.ఈ దీపావళికి రిలీజ్ అవుతుందనుకున్న కరుప్పు వచ్చే ఏడాది సంక్రాంతికి షిఫ్ట్ అయ్యే సూచనలు చాలానే కనిపిస్తున్నాయి. సో 2026 సంక్రాంతికి కరుప్పు, సమ్మర్‌కి విశ్వంభరతో రెడీ అవుతున్నారు త్రిష. కోలీవుడ్‌లో కరుప్పు కి ఎంత క్రేజ్ ఉందో, స్టాలిన్ తర్వాత వచ్చే విశ్వంభరకి టాలీవుడ్‌లోనూ అంతే క్రేజ్ ఉంది.ఓ వైపు సిల్వర్ స్క్రీన్ మీద సినిమాలు చేస్తూనే, మరోవైపు ఓటీటీ ప్రాజెక్టులను కూడా డీల్ చేస్తున్నారు ఈ బ్యూటీ. పోలీస్ ఆఫీసర్‌గా త్రిష నటించిన బృంద ఫస్ట్ సీరీస్ జనాలను మెప్పించింది. అందుకే నయా కేస్‌తో బృంద మళ్లీ రెడీ అంటూ సెకండ్ చాప్టర్‌ని అనౌన్స్ చేశారు మేకర్స్.

## నాని చేతికి దసరా, ది ప్యారడైజ్ బ్యాండ్స్..

### కొత్త వార్తేంటో తెలుసా..?




టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నటిస్తోన్న రెండో ప్రాజెక్ట్ ది ప్యారడైజ్ . ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు.ది ప్యారడైజ్ యాక్షన్ ప్యాక్‌డ్ షెడ్యూల్ పూర్తయిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఇప్పుడు కొత్త వార్త ఒకటి అభిమానుల్లో జోష్ నింపుతోంది. నాని టీం నేడు హైదరాబాద్‌లో నయా షెడ్యూల్‌ను షురూ చేసింది. నానితోపాటు ఇతర యాక్టర్లు సెట్స్‌లో జాయిన్ అయినట్టు సమాచారం.ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారని ఇటీవలే మంచు లక్ష్మి ఆసక్తికర వార్తను షేర్ కూడా షేరింది. ఇక త్వరలోనే మిగిలిన పాత్రలకు సంబంధించిన వివరాలపై క్లారిటీ ఇవ్వనున్నారట మేకర్స్. చేతికి దసరా, ది ప్యారడైజ్ బ్యాండ్స్ ఉన్న స్టిల్ ఒకటి ఇప్పుడు నెట్టింట రౌండప్ చేస్తోంది.

## ఇది నా జీవితకాల జ్ఞాపకం



సినిమా అప్‌డేట్‌లు దర్శక, నిర్మాతలు ఇవ్వడం పరిపాటి. కానీ ఈ మధ్య కథానాయికలు తొందరపడిపోతున్నారు. దర్శక, నిర్మాతల కంటే ముందుగానే తమ సోషల్ మీడియా ద్వారా అప్‌డేట్లు ఇచ్చేస్తున్నారు. కథానాయిక రాశీఖన్నా తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన తాజా ఫొటో ఇప్పుడు అలాంటి దుమారమే రేపింది. పవన్‌కల్యాణ్ స్వయంగా 'ఉస్తాద్ భగత్‌సింగ్' లొకేషన్‌లో తీసిన సెల్ఫీ ఇది. ఇందులో ఆయన చెంతనే రాశీఖన్నా నవ్వులు చిందిస్తూ ఉన్నారు.వెనుక నిర్మాతలు చిత్ర బృందం కనిపిస్తున్నారు. ఈ ఫొటోతో పాటు 'ఈ క్షణాలను లైఫ్ టైమ్ మెమొరీగా గుర్తుంచుకుంటా' అంటూ ఓ కామెంట్‌ను కూడా జత చేసింది రాశీఖన్నా. 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌ను పవన్ ఓ వారంలో ముగించేయనున్నారంటూ గతంలో వార్తలొచ్చాయి. రాశీ షేర్ చేసిన ఫొటో ఇప్పుడు ఆ వార్తలకు బలాన్నిచ్చేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొందరైతే 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌ను పవన్ పూర్తిచేసేశారంటూ ఈ ఫొటో ఆధారంగా వార్తలు రాసేస్తున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492